క్లుప్తంగా

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల పరిధిలోని గంగాలమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.పలువురు దాతలు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్నారు.శనివారం ఆడారి భాస్కరరావు, స్రవంతి దంపతులు రూ.10,116 నగదు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



జగన్నాథున్ని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో సుభద్ర,బలభద్ర సమేత జగన్నాథుడు శనివారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వచ్చేనెల 6వ తేదీన జగన్నాథుని తిరుగు రథయాత్ర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మునగపాక డీటీగా మురళీధర్



బాధ్యతలు చేపడుతున్న మురళీధర్

మునగపాక: స్థానిక మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఆర్.వి. మురళీధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ అధికారుల బదిలీల్లో భాగంగా ఇంతవరకు ఇక్కడ డీటీగా పనిచేసిన శేషుబాబు చోడవరానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చోడవరం మండలం బుచ్చెయ్యపేట డీటీగా పనిచేస్తున్న మురళీధర్‌ను బదిలీ చేశారు. సహ ఉద్యోగులు మురళీధర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనకాపల్లి ఎస్‌డీఏవోగా సుబ్రహ్మణ్యం



బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్రహ్మణ్యం

అనకాపల్లి: స్థానిక సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా సీహెచ్.సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఈయన పాడేరు నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన రామారావు శ్రీకాకుళం జిల్లా పలాస బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు పంపిణీ



అందుకున్న ట్యాబులతో రిసోర్స్‌పర్సన్లు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) పరిధిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు సేవలు వేగంగా అందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విధానానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ధర్మవరం మెప్మా కార్యాలయంలో రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మొత్తం 49 మందికి గెలాక్సీ ఏ9 5జీ ట్యాబ్‌లు అందజేసినట్టు ఆయన తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, సీఎంఎం పద్మావతి, డీఎంసీ వరలక్ష్మి, సీఆర్పీ సత్య కృష్ణవేణి, సీవోలు సుధ, సబల కుమారి, వార్డు కౌన్సిలర్ కొఠారు కొండబాబు, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, లవుడు లోవరాజు, స్వామినాయుడు, కొఠారు శ్రీను, ఊటకూటి రమేష్ పాల్గొన్నారు.

నేడు యాదవ విద్యార్థులకు పురస్కారాలు

కశింకోట: జిల్లాలో ప్రతిభ చాటిన యాదవ విద్యార్థులకు పురస్కారాలు అందివ్వనున్నట్లు జిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కరక సోమునాయుడు తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 550, ఇంటర్‌లో 900 మార్కులు, ఆపైన సాధించిన విద్యార్థులకు అనకాపల్లిలో ఆదివారం ఉదయం పురస్కారాలు అందించనున్నామన్నారు.

కూలేందుకు సిద్ధం



శిథిలావస్థకు చేరిన మునగపాకకు వెళ్లే దారిలో బ్రిడ్జి



పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద శిథిలావస్థకు చేరిన పురాతన బ్రిడ్జి

- ప్రమాదకరంగా పురాతన బ్రిడ్జిలు..
- శిథిలావస్థకు చేరుకున్న వైనం
- వాహన చోదకుల భయాందోళన
- పట్టించుకోని కూటమి పాలకులు

మునగపాక: పురాతన బ్రిడ్జిలు ప్రమాద భరితంగా మారాయి. శిథిలావస్థకు చేరిన అవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. దాంతో వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సాఫీగా సాగాల్సిన ప్రయాణం భయం భయంగా ఉందని వాపోతున్నారు. కూటమి పాలకులు ఇంతవరకూ వీటిపై దృష్టి పెట్టిన పాపాన పోలేదు.

పూడిమడక రోడ్డులో పురాతన బ్రిడ్జితో భయం..

పూడిమడక రోడ్డులో మునగపాక కృష్ణంరాజు కాలువపై గత బ్రిటిష్ కాలంలో బ్రిడ్జి నిర్మించారు. నేడు ఈ బ్రిడ్జి శిథిలావస్థకు గురైంది. నిత్యం ఈ బ్రిడ్జి గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అచ్యుతాపురంలోని సెజ్‌కు పలు బస్సుల ద్వారా ప్రయాణం సాగిస్తున్నారు. అటు అనకాపల్లి వైపు విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు పలు వాహనాలపై ప్రయాణం చేస్తున్నారు. దీనికి తోడు రాంబిల్లి నేవల్ బేస్‌కు భారీ వాహనాలు అధిక లోడుతో వెళ్తున్నాయి. దీంతో బ్రిడ్జి పరిస్థితిని చూసి పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థకు గురైన మునగపాక గ్రామంలోకి వెళ్లే బ్రిడ్జి...

మునగపాకలోకి వెళ్లేందుకు రెండు రోడ్లు ఉన్నాయి. పూడిమడక రోడ్డును అనుసంధానం చేస్తూ గతంలో రహదారులు నిర్మించారు. ఈ రహదారులపై గతంలో బ్రిడ్జిలు నిర్మించారు. రిక్షా స్టాండ్ జంక్షన్ నుంచి మునగపాకలోకి వెళ్లేందుకు తొలుత తాటిచెక్కలతో వంతెన నిర్మించారు. క్రమేణా పాలకులు బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి నేడు శిథిలావస్థకు గురైంది. బ్రిడ్జి అడుగు భాగం పెచ్చులూడిపోతుంది. ఈ బ్రిడ్జిపై నిత్యం వందలాది వాహనాలు అంటే ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ బ్రిడ్జి శిథిలావస్థకు గురికావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు.

సమస్యలు పట్టని కూటమి నేతలు..

తాము అధికారంలోకి వస్తే ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధిపై దృష్టి సారిస్తామంటూ కూటమి నేతలు గొప్పలు చెప్పుకొచ్చారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం కనిపించడం లేదు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెదవి విరుస్తున్నారు. ఎన్నికల ముందు ఊకదంపుడు ప్రచారం చేసిన నేతలు నేడు అభివృద్ధిని పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యామ్నాయంగా మరో బ్రిడ్జి నిర్మాణం

శిథిల బ్రిడ్జిలకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాకలో పురాతన బ్రిడ్జిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రత్యామ్నాయంగా మరో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నాం. వాహన దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– పద్మిని, ఆర్అండ్‌బీ జేఈ

భయం భయంగా రాకపోకలు



మునగపాక గ్రామంలోకి వెళ్లే బ్రిడ్జి నేడు శిథిలావస్థకు గురైంది. బ్రిడ్జి అడుగు భాగం పెచ్చు లూడిపోతోంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు దృష్టి సారించి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– రాజాన బుజ్జిబాబు, ద్విచక్ర వాహనదారుడు,మునగపాక

అధికారులు చర్యలు తీసుకోవాలి



పూడిమడక రోడ్డులో మునగపాక జంక్షన్ వద్ద బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. పురాతన బ్రిడ్జి కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. బ్రిడ్జి అడుగుభాగం అధ్వానంగా ఉంది. నిత్యం ఈ బ్రిడ్జి మీదుగా వందలాది వాహనాలపై ప్రయాణం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– కాండ్రేగుల జగన్, ద్విచక్ర వాహనదారుడు, తిమ్మరాజుపేట

చదువులో ఏకాగ్రతతో రాణించవచ్చు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హైస్కూల్ కమిటీ చైర్మన్ నూకాలయ్య

మునగపాక: ప్రతీ విద్యార్థి ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలని హైస్కూల్ కమిటీ చైర్మన్ పాలమరశెట్టి నూకాలయ్య కోరారు. నాగులాపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శనివారం దుస్తులు, పుస్తకాలు అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏకాగ్రతతో చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకోవచ్చన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిందాడ దేవి, పెద్దలు దొడ్డి శ్రీనివాసరావు, యల్లపు భాస్కరరావు, దొడ్డి బుజ్జి, మళ్ల కాశీ సురేష్, రాజునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ.. దేశ చరిత్రలో చీకటి రోజు



మాట్లాడుతున్న బీవీకే కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ సత్యారావు

మునగపాక: ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ విధించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని విశాఖ బీవీకే కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ వై.సత్యారావు తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో శనివారం స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీని వ్యతిరేకించిన విద్యార్థులపై పలు కేసులు పెట్టి హింసించిందన్నారు. విలేకరులను బెదిరించి ప్రింటింగ్ ప్రెస్‌లకు సైతం కరెంటు లేకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, మళ్ల కాలేశ్వరరావు, బద్దెం సూర్యనారాయణ, యల్లపు రాజేశ్వరరావు, బొడ్డేడ భాస్కరరావు, మళ్ల మల్లయ్యనాయుడు, నరసింగరావు, కన్నప్పారావు, నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలనిస్తున్న గత ప్రభుత్వ సంస్కరణలు

దేవవరం పాఠశాలలో ఒకే రోజు 39 మంది చేరిక



ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులు



దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాల

నక్కపల్లి: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నాడు ముందు చూపుతో విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టిన పలు సంస్కరణలు నేడు ప్రస్ఫుటమవుతున్నాయి. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. గత్యంతరం లేక కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తుండటంతో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థుల ప్రవేశాల్లో దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాల మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఒకే రోజు పట్టణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న 39 మంది విద్యార్థులు దేవవరం పాఠశాలలో చేరారు. హెచ్ఎం వేమగిరి నూకరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను, నాణ్యమైన విద్యను పదో తరగతి ఫలితాలను తల్లిదండ్రులకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావడంతో వారంతా తమ పిల్లలను చేర్పించారని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 123 మంది విద్యార్థులున్నారు. ఈ సంఖ్యను ఈ విద్యా సంవత్సరంలోనే 160కి పెంచడానికి కృషి చేస్తామని హెచ్ఎం తెలిపారు.

నాడు– నేడు పథకం ద్వారా సదుపాయాలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేవవరం పాఠశాలను నాడు– నేడు పథకం కింద అభివృద్ధి చేసింది. రూ.70లక్షలు పైగా కేటాయించి అదనపు భవనాలు నిర్మించింది. బెంచీలు, కిచెన్‌షెడ్లు, డైనింగ్ హాళ్లు, ఆధునిక వసతులతో కూడిన మరుగుదొడ్లు, తాగునీరు, వాడుకనీరు వంటి సదుపాయాలు కల్పించింది. జగనన్న విద్యా కానుక కింద పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, స్కూలు బ్యాగు, బూట్లు, రెండు జతల సాక్సులు, వంటి సామగ్రి అందించింది. అమ్మఒడి కింద ఏటా రూ.13 వేలు చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టింది. సీబీఎస్ఈ సిలబస్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిపుణులైన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు



దివ్య అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వారాహి అమ్మవారు

సబ్బవరం:ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శనివారం ఉత్సవమూర్తి వారాహి అమ్మవారికి క్షీరాభిషేకం, శోడషోపచార సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. వారాహి మాతను భూ ఆధారిత పంటలైన దాన్యతల్పం మీద దివ్య అలంకరణ భూషితగా నూతన వస్త్రాలతో ఆలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం రాత్రి లక్ష్య సాధన కోసం లక్ష్య వారాహీ హోమం నిర్వహించగా శనివారం రాత్రి స్వప్నవారాహీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొనడం ద్వారా వారాహీ మాత మనకు స్వప్నంలో దర్శనమిచ్చి అమూల్యమైన సూచనలు చేస్తుందని భక్తుల విశ్వాసం. అదే విధంగా ఆదివారం రాత్రి తిరస్కరిణీ వారాహీ హోమం జరుగుతున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ హోమం ద్వారా మాయా, భ్రాంతుల తొలగింపుతో పాటు ప్రతికూల శక్తుల నుండి రక్షణ కలగుతుందన్నారు. మధ్యాహ్నం గురుమాత అన్నపూర్ణ చేతుల మీదగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి రూరల్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ బీఎస్ ప్రసాదరాజు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధించిన ఎజెండా వివరాలను వార్డు కౌన్సిలర్లకు పంపించామన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కాకివాని వీధి సంపత్ సాయి జనరల్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యుడు సుతరపు శ్రీకాంత్ తెలిపారు. బీపీ, సుగర్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు 9441305137 నంబరును సంప్రదించాలన్నారు.

పాల సొసైటీ సభ్యులకు అభినందన

అచ్యుతాపురం: మండలంలో నూతనంగా ఎన్నికైన నరేంద్రపురం గ్రామ పాల సొసైటీ సభ్యుల్ని సర్పంచ్ పిన్నమరాజు వాసు శనివారం అభినందించారు. కార్యక్రమంలో చందక నానాజీ, చందక శివ, చందక బాబ్జి, చిట్టి వెంకటరమణ, చందక నాగేశ్, చిట్టి రామచంద్రం, చందక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లోని భూముల సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం: రాచపల్లి రెవెన్యూలో ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని 40 ఏళ్ల నుంచి చుట్టుపక్కల గ్రామాల రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇందులో 600 ఎకరాల భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించనున్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతుల ఆక్రమణల్లో ఉన్న భూములను వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్లు శనివారం నుంచి సర్వే చేస్తున్నారు. సర్వే అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు వీఆర్వో సాంబశివరావు తెలిపారు.

తాగునీరు అందక అవస్థలు

మాకవరపాలెం: తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నామని జి.కోడూరు గ్రామస్తులు తెలిపారు. చాలాకాలంగా శివారు ప్రాంతంలో ఉన్న వారికి కుళాయిల ద్వారా నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

హరి గిరిపై వ్యాయామ శాల ప్రారంభం



మినీ వ్యాయామశాల ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ పీడీ కిశోర్

అచ్యుతాపురం రూరల్: హరిపాలెం హరిగిరిపై విజయదుర్గ ఆలయ ప్రాంగణంలో ఎంఆర్ఎఫ్ శ్రీను సహకారం, రోటరీ క్లబ్ సౌజన్యంతో మినీ వ్యాయామశాల ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ తెలిపారు. రూ.70 వేలతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ హరిగిరిపై రోటరీ క్లబ్ పీడీ జి.కిశోర్ శనివారం ప్రారంభించారు. ఆయనకు సర్పంచ్‌తోపాటు ఎంపీటీసీ శరగడం లక్ష్మిజ్యోతిర్మయి ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎస్.అప్పలనాయుడు, కాండ్రేగుల అప్పారావు, మారిశెట్టి రాము, వెంకటప్పారావు, పెంటకోట అప్పారావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతో మెలగాలి

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



భక్తులకు వడ్డన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు, తదితరులు

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవరుచుకుంటే సమాజానికి ఎంతో మేలు చేకూరుతోందని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకులు పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలు వల్ల ప్రజల్లో ఐక్యత, స్నేహభావం వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మధువర్మ, వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, పాలపర్తి పాపారావు, బోడిపల్లి గోవిందు, వమ్మవరం ఎంపీటీసీ బాలం సూరిబాబు, రామచంద్రపురం మాజీ సర్పంచ్ గెంజి రమణ, నాయకులు కుర్రా కాశి, వియ్యపు సింహాద్రి పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం



పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు

యలమంచిలి రూరల్: తొలి తెలుగు ప్రధాని, గొప్ప ఆర్థిక సంస్కరణవేత్త, బహు భాషా కోవిదుడు పీవీ నరసింహారావు అని స్థానిక గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు రాచకొండ పట్టాభిరామయ్య, పెద్దింటి సూర్యనారాయణ మూర్తి అభిప్రాయపడ్డారు. భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనున్న పీవీ విగ్రహానికి ట్రస్టు ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, ప్రముఖులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకొచ్చి దేశం ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి పీవీ అని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్ బీఎస్ బంగారుశెట్టి, బొద్దపు శ్రీను, ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను, డాక్టర్ సుతరపు శ్రీకాంత్, ఆనివెళ్ల శ్రీనివాసశర్మ, అగ్రెపు గుప్తా, శిష్టా సన్యాసిరావు, సర్వేశ్వర్రావు మాస్టారు, పిట్టా శ్రీను, గంధం శివ పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకల్లో వీఆర్పీలపై చర్యలేవి

సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారులకు నిలదీత



ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

పాయకరావుపేట: గతేడాది చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వీఆర్పీలుపై చర్యలేవని సర్పంచ్‌లు సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారులను నిలదీశారు. డ్వామా పీడీ ఆర్.పూర్ణిమ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపురం, నామవరం, గోపాలపట్నం తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వీఆర్పీలపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆయా గ్రామాల్లో చేపట్టిన కొలతలు సక్రమంగా చూపించడం లేదని, మస్టర్లు వేసి ఉపాధి పనులు చేసినట్లు రికార్డులు చూపించారని, కందకాలు కొలతలు సక్రమంగా చూపించలేదని ఆయా గ్రామాల్లో పనులు పరిశీలనకు వెళ్లిన డీఆర్పీలు ప్రజావేదిక ఎదుట చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో చేపట్టిన పనులు సక్రమంగా చేపట్టలేదని వీఆర్పీలపై నివేదికలు సమర్పించారు. ఈ నివేదికలను ఆధారంగా వీఆర్పీలపై విచారణ చేసి, రికార్డులు పరిశీలించి, చర్యలు తీసుకుంటామని, నిధులు దుర్వినియోగమైనట్టు రుజువైతే రికవరీలు చేపడతామన్నారు. ప్రజా వేదికను అధికారులు తూతూమంత్రంగానే చేపట్టినట్టు పలువురు సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు, 2025 జూన్‌లో చేపట్టిన పనులకు ప్రజావేదిక నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు 1,247, పంచాయతీ రాజ్ పనులు 55, ఎస్ఎస్ఏకు సంబంధించినది ఒక భవనానికి చెందిన పనులు చేపట్టామన్నారు. ఈ పనులు చేయడం కోసం 7,05,53,732 మంది కూలీలు పాల్గొన్నారన్నారు. ఈ పనులు కోసం రూ. 9,33,72,208 ఖర్చు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజా వేదికలో ఏపీవో బి.శ్రీనివాస్, ఏపీడీ యరకాయ్య, ఆడిట్ ఎస్‌టీఎం కె.సత్యనారాయణ, ఎస్ఆర్పీ చిరంజీవి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఏపీవో నానిబాబు తదితరులు పాల్గొన్నారు.